## క్లుప్తంగా

### తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు

**జియ్యమ్మవలస:** తాగునీటి ఎద్దడి నివారణకే క్రాస్ ప్రోగ్రాం చేపడుతున్నామని ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయం నుంచి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం నుంచి 45 రోజుల పాటు క్రాస్ ప్రోగ్రాం ఉంటుందని, ఏ గ్రామంలోనైనా మరమ్మతులకు గురైన బోర్లు ఉంటే వాటిని బాగు చేస్తామన్నారు.

### కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.12,30,460



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

**పాలకొండ:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 4.12.2024 నుంచి 3.3.2025వరకు 89 రోజులకు గాను హుండీల ద్వారా రూ.12,30,460లు ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకుల సమక్షంలో ఉదయం 10 గంటలకు హుండీలను తెరిచి లెక్కింపు చేపట్టారు. సాయంత్రం వరకు లెక్కింపు కొనసాగింది.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహన చోదకులకు సూచనలిస్తున్న ఎస్ఐ అనీష్

**జియ్యమ్మవలస:** మండలంలోని పెదమేరంగి కూడలిలో వాహనదారులతో ఎస్ఐ అనీష్ సోమవారం సమావేశమై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లోకి ఎక్కించవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు.

### కనులపండువగా ఉమా మహేశ్వర స్వామి కల్యాణం



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భామిని:** మండలంలోని బురుజోలలో ఉమా మహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్వామివారి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రంపా జగదీష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. అంతకుముందు మహిళలు ముర్రాటలు తీసుకువచ్చి ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం చేశారు.

### ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



బహుమతి అందుకుంటున్న పెద్దకోటిపల్లి జట్టు క్రీడాకారులు

**పాలకొండ రూరల్:** మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెద్దకోటిపల్లిలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో 45 జట్లు పాల్గొన్నాయి. ఆతిథ్య పెద్దకోటిపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో వీరఘట్టం నిలిచింది. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

### పీఆర్‌టీయూ విజయోత్సవాలు

**వీరఘట్టం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలుపొందిన పీఆర్‌టీయూ నాయకుడు గాదె శ్రీనివాసులనాయుడుకు మండల శాఖ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో విజయోత్సవాలు నిర్వహించారు. గతంలో ఆయన చేసిన కృషి వల్లే మూడోసారి కూడా గెలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు కె.పోలినాయుడు, గర్బాన శ్రీనివాసరావు, బొమ్మాళి బాబూరావు, బంకుర అప్పలనాయుడు, దిబ్బ సూర్యచంద్రరావు, కల్లూరి శివకుమార్ పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు షురూ..

- ఐదో తరగతిలో 240 సీట్ల భర్తీ
- 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు నోటిఫికేషన్
- ఈ నెల 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- వచ్చేనెల 6న ప్రవేశపరీక్ష



సీతంపేటలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల

**సీతంపేట:** గిరిజన గురుకులాల్లో 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదో తరగతిలో పూర్తి స్థాయిలో సీట్ల భర్తీకి, అలాగే 6 నుంచి 9 తరగతులకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పెద్దమడి, సీతంపేట బాలురు, బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మొత్తం 240 సీట్లకు రిజర్వేషన్ పాటించనున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2012 నుంచి 31.08.2016 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ విద్యార్థులు 01.09.2014 నుంచి 31.08.2016 మధ్య జన్మించి ఉండాలి. ఒక్కో పాఠశాలలో ఐదులో 80 సీట్లకు గాను 60 సీట్లు గిరిజన విద్యార్థులకు (పీవీటీజీ విద్యార్థులతో కలిపి), 10 సీట్లు ఎస్సీ విద్యార్థులకు, 02 సీట్లు ఓసీలకు, 4 సీట్లు బీసీ విద్యార్థులకు కేటాయించారు. 2 సీట్లు ఏజెన్సీ ఎంప్లాయిస్ కోటాకు, మరో రెండు సీట్లు ఎస్టీ పీహెచ్‌సీ విద్యార్థులకు కేటాయించారు. 6 నుంచి 9 తరగతుల్లో మిగిలిన 94 సీట్లూ గిరిజన విద్యార్థులకు మాత్రమే కేటాయించారు. రాత పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి మాత్రమే సీట్లు కేటాయిస్తారు.

| పాఠశాల | 5 వతరగతి | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|
| సీతంపేట బాలురు | 80 | 11 | 01 | 06 | 03 |
| సీతంపేట బాలికలు | 80 | 05 | 01 | 02 | 0 |
| పెద్దమడి | 80 | 46 | 05 | 06 | 08 |
| మొత్తం | 240 | 62 | 07 | 14 | 11 |

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి...**

విద్యార్థులు ఆన్‌లైన్‌లో http:// twreircet.apcfrr.in. దరఖాస్తు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి చదివి ఉండాలి.

| షెడ్యూల్ ఇదీ... | |
|---|---|
| దరఖాస్తు చేసుకోవడానికి చివరితేది: | 25.03.2025 |
| హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్: | 28.03.2025 |
| ప్రవేశపరీక్ష తేది: | 06.04.2025 |

## పోలమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

**మక్కువ:** ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారిని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కళావతితో పాటు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు గృహానికి మాజీ ఎమ్మెల్యే కళావతి చేరుకుని పార్టీ కార్యకలాపాలపై కాసేపు ముచ్చటించారు.

### జొన్న, రాగులుకు వింత తెగులు



తెగులు సోకిన జొన్న, రాగి దుబ్బులు

**సీతంపేట:** ఏజెన్సీ పరిధిలోని పలు గ్రామాల్లో రబీ సీజన్‌లో గిరిజనులు సాగు చేస్తున్న రాగులు, జొన్న పంటలకు వింత తెగులు ఆశించింది. బిల్లగూడ ప్రాంతంలో 50 సెంట్ల పొలంలో వేసిన రాగి, జొన్న పంటలకు తెగులు సోకడంతో పంట మొత్తం నాశనమవుతోందని రైతు అప్పన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై స్థానిక వ్యవసాయాధికారి శ్రీదేవి వద్ద ప్రస్తావించగా.. ఇది మొవ్వపురుగు అని తెలిపారు. ఈ తెగులు నివారణకు అగ్ని అస్త్రం పిచికారీ చేయాలని సూచించారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



మాట్లాడుతున్న డీపీఎం షణ్ముఖరాజు

**గరుగుబిల్లి:** మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ప్రకృతి సేద్యంపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీఎస్, సెరికల్చర్, హార్టికల్చర్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు సూచించారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ ఏ గ్రామంలో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏయే రకాల పంటలు పండిస్తున్నారో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 365 రోజుల పాటు పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. నేల పంటలతో కప్పి ఉంచడం వల్ల భూసారం కూడా పెరుగుతుందని రైతులకు వివరించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో రైతులకు తెలియజేసి వారిని ప్రకృతి సాగు వైపు నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు జి.అన్నపూర్ణ, వై.తిరుపతి, ఆర్.శ్రీనివాస్, సీహెచ్ శారద పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత



ఏపీవో బాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీంద్ర

**కొమరాడ:** ఉపాధి హామీ పథకం పనుల్లో పాతమేట్లనే కొనసాగించాలని మర్కొండపుట్టి మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లి రవీంద్ర సూచించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వేతనదారుల్లో విధ్వంసాలు రెచ్చగొట్టి ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ మేట్లను తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని మేట్లుగా నియమించారని విమర్శించారు. ఇప్పటికైనా పాత మేట్లు కొనసాగేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట గ్రామస్తులు గోపినాయుడు, సింహాచలం తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఏఎస్సై కాంతారావు, ప్రిన్స్‌పాల్ విజయనిర్మల

**భామిని:** అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బత్తిలి పోలీసుల ఆధ్వర్యంలో మహిళా రక్షణ చట్టాల ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్స్‌పాల్ విజయనిర్మల, ఏఎస్సై కొండగొర్రి కాంతారావు, మహిళాపోలీస్ చందన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ● వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత..



వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా గుర్తించాలని అటవీశాఖ పాలకొండ రేంజ్ అధికారి కె. రామారావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎన్నో రకాల వన్యప్రాణులు అంతరించిపోయే దశలో ఉన్నాయని తెలిపారు. వన్యప్రాణులను సరంక్షించి, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి, వృక్ష, జంతుశాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు వి.జనార్దన్, పి. రవిబాబు, జె. సోమేశ్వరరావు, ఎం. శాంతి, రాజ్యలక్ష్మి, తిరుపతిరావు, శ్రీనివాసరావు, అటవీశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ

### టిఫిన్ సెంటర్‌లో చోరీ

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు రోడ్డులో ఉన్న టిఫిన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వంటపాత్రలతో పాటు రూ.5 వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్లు బాధితుడు గెంబలి లవరాజు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.20 వేలు నష్టపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### హౌసింగ్ బిల్లు ఇవ్వండి సారూ..!



**పార్వతీపురం టౌన్:** పట్టణంలోని బెలగాంకు చెందిన గొబ్బి సత్యవతి తనకు హౌసింగ్ బిల్లు కావాలని పలుమార్లు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేది. అయినా ఫలితం దక్కకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇంటి నిర్మాణం ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పునాదులు వేసి గోడలు కట్టేవరకు బిల్లులు పడ్డాయని, శ్లాబ్ పూర్తి చేసిన బిల్లులు పడకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, కనీసం ఎవరూ స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

### విద్యార్థులకు మంచి చేతిరాత నేర్పించాలి



అజ్జాడ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

**బలిజిపేట:** విద్యార్థులకు మంచి చేతిరాతను నేర్పించాలని ఎంఈఓ–1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అజ్జాడ, మురగడాంలలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థులచేత చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. విద్యార్థి నైపుణ్యాలను పరిశీలించి అందుకు అనుగుణంగా వారికి తర్ఫీదును అందించాలని చెప్పారు. ముఖ్యంగా చేతిరాత బాగుండే విధంగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. అజ్జాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. మంచి మార్కులు ఏవిధంగా సాధించాలనేదానిపై వారికి సూచనలు అందజేశారు. మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

### కళ్లద్దాల పంపిణీ

**భామిని:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 42 మంది విద్యార్థులకు ఆప్తాలమిస్ట్ టి.కృష్ణారావు, ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్ సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు ఇటీవల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేసినట్లు తెలిపారు.



విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తున్న ఆప్తాలమిస్ట్ కృష్ణారావు, ప్రిన్స్‌పాల్ శివకుమార్

## ● రోగుల తాకిడి..



వేసవి ప్రారంభం కావడంతో ఎండ దెబ్బకు స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. సోమవారం సుమారు 350కి పైగా రోగులు రావడంతో సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఇందులో ఎక్కువ మంది నీరసంతో బాధపడుతున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. అన్న రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలున అందిస్తున్నట్లు చెప్పారు.

– సీతంపేట

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

**సీతంపేట:** తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిఎద్దడి గ్రామాల జాబితా తయారు చేసి అందుకు తగ్గట్టుగా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామానికీ నీరు సరఫరా అయ్యేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రణాళికలు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి పాల్గొన్నారు.

### సక్రమంగా ఉపాధి పనులు



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం

**భామిని:** ఉపాధి వేతనదారులకు ఇబ్బందుల్లేకుండా పనులు కేటాయించాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని బాలేరు ఊర చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్లను పరిశీలించి, 300 మంది వేతనదారులకు గాను 281 మంది హాజరైనట్లు గుర్తించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఫారమ్‌పాండ్స్, గోశాలలను పరిశీలించారు.

## ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సింహాచలం

**భామిని:** ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. మండలంలోని నులకజోడులో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ తమ జిరాయితీ భూములకు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుని విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. ఈ నంబర్ ఉంటేనే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, ఇతర సౌకర్యాలు అందుతాయన్నారు. మండలంలో 5,960 మంది పీఎం కిసాన్ పొందిన రైతులుంటే ఇంతవరకు 3,200 మంది మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్య పొందారని చెప్పారు. రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకుడు మహేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

### జాగ్రత్తలు తప్పనిసరి



పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది

**పాలకొండ:** పాడి సంపదను కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి సిద్ధార్థ అన్నారు. మండలంలోని పీఆర్ రాజుపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రామినాయుడు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు పాల్గొన్నారు.

### పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

**గరుగుబిల్లి:** మండలంలోని చిలకాం గ్రామానికి చెందిన గుల్ల సూర్యనారాయణ కొడుకు కిరణ్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు.. సూర్యనారాయణ ఇంటికి సోమవారం వెళ్లి, పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ ద్వారపురెడ్డి గంగమ్మ, నాయకులు కేతిరెడ్డి కూర్మినాయుడు, బొత్స తాతబాబు ఉన్నారు.

## సకాలంలో వైద్య సేవలందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

**కొమరాడ:** రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని గుణానపురం వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణుల ఆరోగ్యం మెరుగుపై వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. బీపీ, మధుమేహం వంటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయాలన్నారు.

### త్వరితగతిన ఇంజినీరింగ్ పనులు

**సీతంపేట:** ఇంజినీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారుల నిర్మాణాలు, మల్టీపర్పస్ భవనాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని సూచించారు. పూర్తి చేసిన పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
✆ 9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com